క్లుప్తంగా

అపరిచిత వ్యక్తుల కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

న్యాల్‌కల్(జహీరాబాద్): అపరిచిత వ్యక్తుల కాల్స్, మెసేజ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్‌ఐ చల్లా రాజశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీవాణి హైస్కూల్‌లో బుధవారం సైబర్ నేరాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్ల కాల్స్, మెసేజ్‌లు పెట్టి ప్రజలను మోసం చేస్తున్నారని అలాంటి వారి పట్ల మీ తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. ముఖ్యంగా బ్యాంక్ నుంచి కాల్ చేస్తున్నామని, బ్యాంక్ ఖాతా వివరాలను చెప్పాలని సైబర్ నేరగాళ్లు అడుగుతారు.. వారికి ఎలాంటి వివరాలు చెప్పొద్దని సూచించారు. మోసాలు జరిగితే 1930కు వెంటనే కాల్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



జొన్నపంట ఫొటో తీస్తున్న ఏఈఓ

మునిపల్లి(అందోల్): తప్పనిసరిగా పంటల వివరాలు నమోదు చేసుకోవాలని పెద్దచల్మెడ వ్యవసాయ విస్తరణ అధికారి లావణ్య పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చిన్నచల్మెడ గ్రామశివారులో పంటలను ఫొటో తీశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే శనగలు, జొన్నలను అమ్ముకోవాలన్నారు. పంటల వివరాల నమోదు ప్రకారం ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. పంటల నమోదులో రైతులు అశ్రద్ధ చేయొద్దని సూచించారు.

నివేదిక ఇవ్వడం బాధాకరం



మాట్లాడుతున్న విశ్వనాథం

నారాయణఖేడ్: ఎస్సీ వర్గీకరణకు సంబంధించి షమీముక్తార్ ఏకసభ్య కమిషన్ 82 రోజుల్లోనే నివేదిక ఇవ్వడం బాధాకరమని నియోజకవర్గ మాలమహానాడు అధ్యక్షుడు విశ్వనాథం అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. 2011 జనాభా లెక్కల ప్రకారమే సర్వేచేసి నివేదిక ఇవ్వడం సరికాదన్నారు. గ్రూప్-3లో మాదిగలకు తొమ్మిది శాతం రిజర్వేషన్లు కల్పించాలని నివేదికలో పేర్కొనడం చట్టపరంగా చెల్లదన్నారు. ఈ మేరకు తమ సంఘ రాష్ట్ర కమిటీ సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనుందన్నారు. వర్గీకరణ విషయంలో చట్టబద్ధతతో పార్లమెంట్‌లో ఆమోదించిన అనంతరం గెజిట్ విడుదల చేయాలన్నారు.

పశుపోషణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారులు

జహీరాబాద్: రైతులు పశుపోషణపై అవగాహన కలిగి ఉండాలని పశువైద్యాధికారులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని దిడిగి గ్రామ శివారులోని డీడీఎస్-కేవీకేలో నిర్వహించిన కార్యక్రమంలో పశు వైద్యాధికారులు సునీల్‌దత్, హర్షవర్ధన్‌రెడ్డి, అజింక్య మాట్లాడారు. వ్యాధుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి తీవ్రత పెరగక ముందే వైద్యం అందించాలన్నారు. పునరుత్పత్తిని పెంచుకునేందుకు మినరల్ మిక్చర్ వాడాలన్నారు. లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే సైంటిస్ట్ సి.వరప్రసాద్ మాట్లాడుతూ.. రైతులకు పశు సంరక్షణ విషయంలో సేవలు అందించేందు కు కలిసి పని చేస్తామన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు, గోపాల మిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ ప్రత్యేకపాలన అధికారి, మున్సిపల్ జాయింట్ డైరెక్టర్ ఫాల్గున్ కుమార్ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను, పారిశుద్ధ్యం అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ నూతన కళ్యాణ మండపాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తదితరులున్నారు.

అలంకారప్రాయంగా షాపింగ్ కాంప్లెక్స్

- అసంపూర్తిగా నిర్మాణ పనులు
- ఆదాయం కోల్పోతున్న రైల్వేశాఖ



నిలిచిపోయిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ రైల్వేస్టేషన్ వద్ద నిర్మాణంలో ఉన్న కమర్షియల్ కాంప్లెక్స్ అలంకార ప్రాయంగా మారింది. కోట్ల రూపాయలతో చేపడుతున్న పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దక్షిణ మధ్య రైల్వేశాఖ, ప్రైవేట్ భాగస్వామ్యంతో రైల్వేస్టేషన్ ప్రాంతంలో మల్టీఫంక్షన్ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, పార్కు నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల క్రితం రూ. 20 కోట్లు మంజూరు చేసింది. రైల్వే స్టేషన్ ప్రాంతంలో విశాలమైన స్థలం ఉండడంతో రైల్వేశాఖ కాంప్లెక్స్ పనులు ప్రారంభించింది. దుకాణాల సముదాయ నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం, ప్రైవేట్ సంస్థకు అప్పగించి 40 ఏళ్ల లీజుకు ఇచ్చింది. సదరు సంస్థ అద్దె, లీజు ప్రాతిపదికన ముందుకు వచ్చే వ్యాపారులకు దుకాణాలను కేటాయించాలని నిర్ణయించింది. మల్టీ ఫంక్షనల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో బట్టలు, బంగారం దుకాణాలతో పాటు హోటళ్లకు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆదాయం కోసం రైల్వే శాఖ చేపట్టిన దుకాణాల సముదాయం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ఇప్పటివరకు పనులు పూర్తిచేసి ఉంటే కాంప్లెక్స్‌ను అద్దెకు ఇచ్చేందుకు అవకాశం ఉండేది. నిర్మాణం పనులు ఆగిపోవడం వల్ల రైల్వేశాఖ ఆదాయాన్ని కోల్పోవాల్సి వస్తుంది. రైల్వేశాఖ అధికారులు స్పందించి ఆగిన దుకాణాల సముదాయం పనులను ప్రారంభించి పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోగుల నుంచి డబ్బు వసూళ్లు



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కొండాపూర్ (సంగారెడ్డి): డెలివరీ కోసం ప్రభుత్వాసుపత్రికి వస్తే డబ్బులు వసూళ్లు చేస్తున్నారని తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కొండాపూర్‌లో మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు. యాదగిరి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ అయితే ముక్కు పిండి మరీ డబ్బులు వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. ఆడపిల్ల పుడితే రూ.3 వేలు, మగ పిల్లాడు పుడితే రూ. 5 వేలు ఇవ్వాల్సిందేనని ఆస్పత్రి సిబ్బంది హుకుం జారీ చేస్తున్నారని అన్నారు. సిబ్బందిపై చర్యలు తీసుకోకుండా జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి రాజయ్య సీఐటీయూ మండల కార్యదర్శి బాబురావు, సీపీఎం నాయకులు అర్జున్, అనిల్, శివ తదితరులు పాల్గొన్నారు .

ఉత్పత్తిదారుల సంస్థలే కీలకం



మాట్లాడుతున్న సంతోష్‌కుమార్

కంగ్టి(నారాయణఖేడ్): సుస్థిర వ్యవసాయానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థలే(ఎఫ్‌పీఓ) కీలకమని వ్యవసాయ విస్తరణాధికారి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని నాగుర్(కే) గ్రామంలో బుధవారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు, ఉత్పత్తిదారుల సంస్థల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. రైతులు వనరుల సమీకరణ, మార్కెట్ యాక్సెస్‌ను మెరుగుపరచడంతో రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరిచి గ్రామీణాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. ఎఫ్‌పీఓలకు కేంద్ర ప్రభుత్వం పలు పథకాలతో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన



నృత్యాలు చేస్తున్న మహిళలు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ శివారులోని బీరప్ప మందిరంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. గొల్లకుర్మ యాదవ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాలు ఊరేగించారు. మహిళలు నృత్యాలు చేసి అలరించారు. మందిరంలో ప్రత్యేకంగా పూజలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లచ్చవ్వ, మాజీ ఎంపీటీసీ సంగప్ప, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీర్‌షెట్టి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

వట్‌పల్లి(అందోల్): అందోల్ మండలంలోని అన్నాసాగర్ 132కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా గురువారం ఉ.10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అందోల్ ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ ఒక బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. జోగిపేట, చిట్కుల్, గడిపెద్దాపూర్, డాకూర్, లక్ష్మీసాగర్ 33 కేవీ సబ్‌స్టేషన్ల ప్రతి ఫీడర్‌ని ఎల్‌సీ తీసుకొని టవర్స్‌కి పెయింట్, మరమ్మతులు చేపట్టనున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ, మండల పరిధిలోని 24 గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు చెప్పారు.

చిరుధాన్యాల పంటల సాగుతో లబ్ధి



బోనాలతో జాతరకు స్వాగతం పలుకుతున్న రైతులు

ఝరాసంగం(జహీరాబాద్): చిరుధాన్యాల పంటలు ప్రతి ఒక్కరు సాగు చేయాలని డీడీఎస్ ప్రతినిధి వినయ్‌కుమార్ అన్నారు. డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నా పాత పంటల జాతర బుధవారం మండలంలోని చిల్కపల్లిలో కొనసాగింది. గ్రామానికి వచ్చిన పాత పంటల జాతరకు రైతులు, ప్రజలు బోనాలతో ఘనంగా స్వాగతం పలికారు. చిరుధాన్యాల సాగుతో ఉన్న ఎడ్ల బండ్లు, డప్పు చప్పుళ్ల మధ్య అవగాహన కల్పిస్తూ ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. డీడీఎస్ సంఘాలు ఏర్పడి 40 సంవత్సరాలు పూర్తి కావస్తుందన్నారు. మన తిండి, ఆరోగ్యం, పశువులు, భూములు సమర్థవంతంగా ఉండాలనే ఉద్దేశంతో జాతర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చిరుధాన్యాల సాగుతో ఆదాయం, ఆరోగ్యం పొందువచ్చన్నారు. కార్యక్రమంలో డీడీఎస్ జాయింట్ డైరెక్టర్ గిరిధర్ బాబు, జాతర కోఆర్డినేటర్లు మంజుల, బాలయ్య, విజయలక్ష్మి, నర్సమ్మ, ప్రతినిధులు, రైతులు మాణిక్‌రెడ్డి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనతో సామాజిక న్యాయం

కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్



సమావేశంలో మాట్లాడుతున్న నీలం మధు

పటాన్‌చెరు టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణనతో బీసీలకు సామాజికంగా, రాజకీయంగా న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. బుధవారం నర్సాపూర్‌లో ఏర్పాటు చేసిన ముదిరాజ్ సంకల్ప భేరి సభకు రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ముఖ్యంగా ముదిరాజ్‌లకు పెద్దఎత్తున అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. కులగణన చేయడంతో బీసీల జనాభాలో ముదిరాజ్‌ల శాతం రాష్ట్రంలోనే ఎక్కువగా ఉందని తేలిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ముదిరాజ్‌ల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు ముదిరాజ్ సంక్షేమ సమితి సభ్యులు నారాయణ, నర్సింలు, సురేష్, రమేష్, సంగారెడ్డి జిల్లా మత్స్యశాఖ డైరెక్టర్లు శ్రీనివాస్, మహేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సీతారామ విగ్రహాల ఊరేగింపు

జోగిపేట(అందోల్): జోగిపేటలో ఈనెల 8న ప్రతిష్ఠంచనున్న సీతారామ చంద్రస్వామి విగ్రహాల ఊరేగింపును బుధవారం ఘనంగా నిర్వహించారు. స్వామి విగ్రహాలతో పాటు ఇతర విగ్రహాలను ప్రత్యేక వాహనంలో ఏర్పాటు చేసి పబ్బతి హనుమాన్ మందిరం వద్ద నుంచి శ్రీ రాజరాజేశ్వర దేవాలయం వరకు ఊరేగించారు. వందల సంఖ్యలో మహిళలు, పురుషులు కాషాయ కండువాలు, జెండాలు, మహిళలు మంగళ హారతులతో ముందు నడిచారు. డీజే సౌండ్‌తో యువకులు నృత్యాలు చేసుకుంటూ ముందుకు కదిలారు. అడుగడుగునా భక్తులు విగ్రహాలకు పూజలు చేశారు.

◆ మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలో బీజేపీ శ్రేణులు భారత ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జగన్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో ప్రవేశపెట్టిన బిల్లుతో సామాన్య ప్రజలకు ఉద్యోగస్తులకు మేలు జరుగుతుందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు నర్సింగరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ ఎస్సీలకు అవకాశం కల్పించాలి

కొండాపూర్(సంగారెడ్డి): త్వరలో నిర్వహించనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులకు ఎస్సీ రిజర్వేషన్‌ను కేటాయించాలని బీఆర్ఎస్ నాయకులు రవి ప్రభుత్వాన్ని కోరారు. గత 20 సంవత్సరాలుగా కొండాపూర్ మండలానికి సంబంధించి జెడ్పీటీసీ, ఎంపీటీసీ పదవులు రిజర్వేషన్‌లు ఎస్సీలకు అవకాశం రాలేదన్నారు. ఈసారి రెండు పదవులను ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై త్వరలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు.

◆ నూతన నియామకం

జహీరాబాద్ టౌన్: నియోజకవర్గం తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) నూతన కార్యవర్గాన్ని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా కృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఖలీల్, జయరాజ్, ప్రధాన కార్యదర్శిగా ఏసు, కార్యదర్శులుగా మొగులమ్మ, లలితమ్మ, కోశాధికారిగా శ్రీనివాస్, కమిటీ సభ్యుడిగా జయరాజ్, తిరుమలేశ్ ఎన్నికయ్యారు.

◆ బహుమతులు అందజేత

జిన్నారం (పటాన్‌చెరు): పాఠశాలల అభివృద్ధికి హెట్రో పరిశ్రమ యాజమాన్యం అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమని గుమ్మడిదల మండల విద్యాధికారి రాంబాబు అన్నారు. బుధవారం మున్సిపాలిటీలోని బొంతపల్లి జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

◆ ఉచిత కంటి వైద్య శిబిరం

సదాశివపేట(సంగారెడ్డి): ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగించుకోవాలని అయ్యప్ప సేవాసమితి అధ్యక్షుడు గోనె శంకర్, ఉపాధ్యక్షుడు సుధాకర్‌గౌడ్ గురుస్వాములు పేర్కొన్నారు. శంకర కంటి ఆస్పత్రి నానక్‌రామ్‌గూడ హైదరాబాద్ సౌజన్యంతో అయ్యప్ప సేవాసమితి ఆధ్వర్యంలో బుధవారం నర్సింహారావు, ఓదెల ప్రభుగురుస్వామిల జ్ఞాపకార్థం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర కంటి ఆస్పత్రి వైద్య బృందం డాక్టర్లు సిబ్బంది ఆధ్వర్యంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న వారికి ఆపరేషన్ చేయించనున్నట్లు చెప్పారు.

◆ విద్యాసామగ్రి పంపిణీ

నారాయణఖేడ్: మనూరు మండలం డోవూరు మండల పరిషత్తు పాఠశాలలో ఎన్‌టీటీ డాటా సాఫ్ట్‌వేర్ సంస్థ డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్, యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్ కిట్స్, విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. పేద విద్యార్థులకు కోసం పంపిణీ చేశామని యూత్‌ఫర్ సేవ బాధ్యులు చంద్రశేఖర్ ఆచార్య తెలిపారు.

◆ వేతనాలు చెల్లించాలి

నారాయణఖేడ్: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న సిబ్బందికి నాలుగు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.రమేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏఐటీయూసీ తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకట్ రాజ్యం, జిల్లా నాయకులు చిరంజీవి మాట్లాడుతూ.. ఆస్పత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది, హౌస్‌కీపింగ్, పేషెంట్‌కేర్ సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వేతనాలు చెల్లించని పక్షంలో గురువారం నుంచి నిరసనలు చేపడతామని హెచ్చరించారు.

అన్ని వర్గాల అభివృద్ధికి కృషి

టీజీఐఐసీ చైర్ పర్సన్ నిర్మలారెడ్డి



సంబురాల్లో పాల్గొన్న నిర్మలారెడ్డి తదితరులు

సంగారెడ్డి జోన్: అన్ని వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు కులగణన, బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో బిల్లు పాస్ అయింది. సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి వర్గ కమిటీ సభ్యులకు కృతజ్ఞతగా బుధవారం నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలో మిఠాయిలు పంచి, బాణసంచా కాల్చి సంబరాలు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చరిత్రలో ఎప్పుడు ఏ పార్టీ చేయని పని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందన్నారు. ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో తీర్మానం చేసి కాంగ్రెస్ చరిత్ర సృష్టించిందన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి ఆంజనేయులు, మాజీ గ్రంథాలయ చైర్మన్ అనంతకిషన్, సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు, కంది, సదాశివపేట మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్, సిద్ధన్న, యూత్ కాంగ్రెస్ నాయకుడు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరిణిలో చక్ర స్నానోత్సవం



వేంకటేశ్వరస్వామికి చక్రస్నానం చేయిస్తున్న అర్చకులు, భక్తులు

సంగారెడ్డిటౌన్: పట్టణ శివారులోని వైకుంఠపురం దేవాలయ 12వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా దేవాలయ ఆవరణలోని పుష్కరిణిలో వేంకటేశ్వరస్వామికి చక్రస్నానోత్సవం అర్చకులు వరదాచార్యుల ఆధ్వర్యంలో వేదమంత్రాల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గీతం నూతన వీసీగా ఎర్రోల్ డిసౌజా



పటాన్‌చెరు టౌన్: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఉప కులపతి (వీసీ)గా ప్రముఖ విద్యావేత్త, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అహ్మదాబాద్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ ఎర్రోల్ డిసౌజా నియమితులయ్యారు. గీతం అధ్యక్షుడు భరత్ బుధవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన టౌన్ హాల్ సమావేశంలో విషయాన్ని సిబ్బందికి వెల్లడించి, నూతన వీసీని అందరికీ పరిచయం చేశారు. డాక్టర్ డిసౌజా నియామకంపై గీతం అధ్యక్షుడు భరత్ హర్షం వ్యక్తం చేశారు.

అనుమతి లేని షెడ్లను తొలగించండి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడ నుంచి కిష్టారెడ్డి పేటకు వెళ్లే ప్రధాన రహదారి వెంబడి నాలా కన్వర్షన్ లేకుండా వ్యవసాయ భూముల్లో భారీ షెడ్లు నిర్మించి వ్యాపారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు బుధవారం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకుడు నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా వ్యవసాయ భూముల్లో భారీ షెడ్లు నిర్మాణం చేసి వైన్ షాపులు, బార్లు, రెస్టారెంట్లు, క్రీడా ప్రాంగణాలు నిర్మించి వ్యాపారాలు చేస్తున్నారని ఆరోపించారు. వీరి నుంచి ప్రభుత్వానికి రూపాయి ఆదాయం లేదు.. కానీ వాళ్లు మాత్రం లక్షల్లో ఆదాయాలు పొందుతున్నారని మండిపడ్డారు. నాలా కన్వర్షన్ కోసం ప్రభుత్వానికి డబ్బులు చెల్లించకుండా.. మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా, రూపాయి పన్ను చెల్లించకుండా ప్రభుత్వ ఖజానాకు గండి కొడుతున్నారు. సామాన్యులు చిన్న గుడిసె వేసుకుంటే అనుమతి లేదని కూల్చివేసే అధికారులు భారీ షెడ్లు వేసి వ్యాపారాలు చేస్తుంటే ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. అనుమతి లేకుండా నిర్మించిన షెడ్లను వెంటనే కూల్చివేయాలని, వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీరాస్వామి, జిలాని, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు



వర్రకుంటను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని వర్రకుంట ఆక్రమణపై చెన్నైయ్ గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టులో గతంలో స్థానికులు పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ ఆర్డీఓ రవీందర్ రెడ్డి వర్రకుంట ప్రాంతాన్ని పరిశీలించారు. రికార్డుల పరంగా కుంట భౌతికంగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించి కుంటను గుర్తించాలని ఆదేశించారు. ఆక్రమణకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో సమావేశం నిర్వహించి రికార్డులను పరిశీలించారు. తహసీల్దార్ భిక్షపతి, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, ఆర్వో నర్సింలు, ఆర్‌ఐ జయప్రకాష్ నారాయణ, ఏఈ కిష్టయ్య, ఇరిగేషన్ ఏఈ ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారి పవన్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కంగ్టి(నారాయణఖేడ్): పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని.. చెట్లు పెంచడం అందరి బాధ్యతగా తీసుకోవాలని యువసైన్యం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కాలుష్య నివారణ చర్యలతో పాటు ప్రతీ వ్యక్తి చెట్లు పెంచాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యువసైన్యం సభ్యులు మెండె సంతోష్‌రెడ్డి, అనిల్, రవి, శివ, శంకర్ పాల్గొన్నారు.

పన్నులు చెల్లించకుంటే చర్యలు

మున్సిపల్ కమిషనర్ ఉమ



దుకాణం సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సదాశివపేట(సంగారెడ్డి): ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు సకాలంలో చెల్లించకపోతే చట్టపరంగా చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఉమ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని సిద్దాపూర్‌గాని ప్రాంతంలో ఆస్తిపన్ను బకాయిలు చెల్లించకపోవడంతో దుకాణాన్ని సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ 2019 ప్రకారం ఆస్తి జప్తు, నల్లా పన్ను చెల్లించకుంటే కనెక్షన్ తొలగిస్తామన్నారు. పట్టణ ప్రజలందరూ పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ ఉమ కోరారు.